జ్ఞాన యోగం

మోక్ష మార్గము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org

సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని శుకబ్రహ్మాశ్రమం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) శుకబ్రహ్మాశ్రమం వారి వెబ్ సైట్: www.srisukabrahmashram.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో శుకబ్రహ్మాశ్రమం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org   Mobile App: Free Gurukul   email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul   Helpline/Whatsapp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

మోక్షమార్గము

రచయిత :

శ్రీ విద్యాప్రకాశానంద గిరిస్వాములవారు

ఈ గ్రంథము గుంటూరుజిల్లా నరసరావుపేట తాలూకా
అనంతవరం గ్రామకాపురస్తులు కీర్తిశేషులైన పంచా
రోశయ్యగారి జ్ఞాపకార్థము వారి కుమారుల
ద్రవ్యసహాయముచే ముద్రింపబడి
శ్రీ కాళహస్తి యందలి శ్రీ శుకబ్రహ్మాశ్రమమునందు
శ్రీ శ్రీ శ్రీ మహర్షి మలయాళస్వాములవారి
యాజమాన్యమున జరిగిన శ్రీ సనాతన వేదాంతజ్ఞానసభా
అష్టావింశ వార్షికోత్సవ సందర్భమున
భక్తుల ఉపయోగార్థము
ప్రకటింపబడినది.

విజయనామ సం॥
ఫాల్గుణశుద్ధ పౌర్ణమి
19—3—1954

ఓమ్
తత్సత్

శ్రీ శుకబ్రహ్మాశ్రమము
కాళహస్తి. (పోస్టు)
(చిత్తూరుజిల్లా)

Acc No 5746

శ్రీ మహర్షి మలయాళస్వాములవారి
సదుపదేశములు

1. నిర్మలమైన దైవభక్తియు, ప్రాణికోట్లసేవయు ఇహపరసౌఖ్యములకు మార్గము.

2. అంతఃకరణమునందలి వృత్తులు, సంకల్పములు, గుణములు, వాసనలు పూర్తిగా విలయము నొందువఱకును, సాధనములందు జీవితమెల్ల వినియోగపఱచవలెను.

3. సాధనానుష్ఠానములద్వారా మనోజయమును సాధించినవాడే నిజమైన బలవంతుడు. మనోజయము లేనివాడెంత సింహబలుడైనను నిజముగ దుర్బలుడే.

4. మహత్తరమైన పుణ్యముచేతగాని మానవజన్మ లభించదు. అదియు బుద్బుదమువలె క్షణభంగురమే. దీనిని యెఱింగిన విజ్ఞులు కాలమును వృథాచేయరు. కాలముయొక్క విలువను గుర్తించి సదా పరమాత్మధ్యానములో గడుపుటయే మానవుని ముఖ్యధర్మము.

5. నీటిలో పడవ యుండవచ్చునుగాని, పడవలో నీరు ఉండగూడదు. అట్లే సంసారములో నీవు ఉండవచ్చునుగాని నీలో సంసార ముండరాదు.

ఓమ్ తత్ సత్.

Acc no: 5746

మోక్షమార్గము

(శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు)

'స్వరాజ్యము మన జన్మహక్కు' అని తిలక్ మహాశయుడు ఎలుగెత్తి చాటిన విధమున 'స్వారాజ్యము (ఆత్మసామ్రాజ్యము, మోక్షము) మన జన్మహక్కు' అని ఋషులందరును ఉద్ఘోషించి యున్నారు. స్వరాజ్య, స్వారాజ్యములు రెండును జీవునకు ఆవశ్యకములే. బాహ్యమున పరరాజుల బానిసత్వము, అభ్యంతరమున ఇంద్రియ మనంబుల బానిసత్వము జీవుని ఆక్రమించి వేధించుచున్నవి. అతనిని అస్వతంత్రునిగ జేసి వైచుచున్నవి. కాని, భారతీయుల అకుంఠిత కార్యదీక్షచే స్వరాజ్య మెట్టకేలకు సంప్రాప్తించినది. అంతటితో తృప్తి పొందరాదు. చేయవలసిన కార్యమింకను చాలకలదు. ఒక బానిసత్వము వదలినను, దానికి పదిరెట్లు బలవత్తరమైన మఱియొక బానిసత్వము తిష్ఠవేసికొని యున్నది. అది ఈ జన్మయందే కాదు. జన్మజన్మాంతరముల నుండియు జీవుని వెంటాడి బాధించుచున్నది. ఆ ప్రబల శత్రువును ఉన్మూలించినగాని పూర్ణ శాంతి సౌఖ్యములు జీవునకు కలుగనేరవు. శారీరికబాధ శమించినను మానసిక బాధకలవారికి శాంతియెచట? కాబట్టి ఇంద్రియ మనంబుల దాసత్వమునుండి విడివడిననాడే, కామక్రోధాదుల బారినుండి తప్పించుకొనిననాడే, ప్రకృతి పారతంత్ర్యమును పారద్రోలి, ఇంద్రియమనంబులపై నాధిపత్యము వహించి వానియొక్క దాస్యశృంఖలములనుండి విముక్తి నొందిననాడే పూర్ణస్వాతంత్ర్యమును బొందినవార మగుదుము.

ఈ సత్యమును మనస్సునం దిడుకొనియే శ్రీకృష్ణభగవానుడు కామాదిరూపమగు ఆ యాంతరంగిక ప్రబల శత్రువు నైనైన జయించియే తీరవలెనని అర్జునునకు శాసించెను.

‘జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్.’

‘ఓ అర్జునా! ఆ కామాదులు నీకు శత్రువులు! ముముక్షువులకు శత్రువులు! బహుజాగ్రత! నీ జ్ఞానమునంతను అవినాశనముచేసి నిన్నధోగతికి త్రోసివేయును. కావున వానిని ముందుగా జయించి వేయుము’ - అని భగవంతుడు హెచ్చరిక చేసియున్నాడు. కావున ఓ ముముక్షువులారా! సాధకులారా! మనలో ఒక గొప్ప శత్రువు కలడు. లోకము లన్నిటిని మనము జయించినప్పటికిని ఆశత్రువునకు లొంగిపోయినచో మనము యథార్థమైన విజేతలము కానేరము. కాబట్టి ఈ విషయమై బహుజాగరూకులై వర్తింపవలయును.

ఆశాయా దాసా యే తే దాసాస్సర్వలోకస్య,
ఆశా దాసీ యేషాం తేషాం దాసాయతే లోకః.

అంతరంగ శత్రువగు ఆశకు దాసులైనవారు లోకమున కంతకు దాసులే యగుదురు. కాని ఆ ఆశ యెవరికి దాసియై యుండునో లోకమంతయు వారికి దాసానుదాసియే యగును.

ఆత్మస్వాతంత్ర్య సంపాదన మొనగూర్చునట్టి ఆ యభ్యంతర శత్రువిచ్ఛేదన మెట్లు సంభవించునో, ఆ యుపాయమును శ్రీ భగవానులే యిట్లు సెలవిచ్చియున్నారు.

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మాన మాత్మనా,
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్.

అనగా బుద్ధికంటెను ఆత్మ పరమైనట్టిదిగ తెలిసికొని, అట్టి తురీయాత్మయందు నిలుకడ కలిగి కామరూపమగు మహాశత్రు

వును జయించివేయుము.' సంపూర్ణమైన ఇంద్రియనిగ్రహము కలుగుటకు నిది యొకటియే యుపాయము. వేదాంతముయొక్క కీలకమంతయు ఇచటనేయున్నది. ఇతరములగు చిన్న చిన్న సాధనములచేతను, ఉపాయములచేతను ఇంద్రియ మనంబుల నిగ్రహము కొంతవఱకుమాత్రమే సాధ్యమగునుగాని పూర్ణముగగాదు. అత్తఱి వాసన ఒకింత శేషించియేయుండును. పరమాత్మదర్శనము కలుగు నప్పుడు ఆ వాసన సంపూర్ణముగ నశించిపోవును. అయితే ఆ పరమాత్మ దర్శనమెట్లు కలుగును? - అనాత్మరూపములగు దేహేంద్రియ మనోబుద్ధ్యాదులు దృశ్యము కావున వానిని తొలగించివైచి తత్సాక్షియగు ఆత్మయే తానని బాగుగా నిశ్చయించుకొనవలెను. తాను మనోబుద్ధీంద్రియములకు విలక్షణుడనియు, సాక్షియనియు బోధ యెప్పుడు దృఢముగ గలుగునో, అప్పుడు మనస్సు, ఇంద్రియములు లెస్సగ స్వాధీనము లగును. అప్పుడే జీవుడు మోక్షస్థితిని బడయగల్గును. ఇదియే వేదాంతముయొక్క సారము.

అత్తఱి తా నేకాలమందును జన్మించలేదనియు, మరణించలేదనియు, ఇంతదనుక ఈ మహానాటకమంతయు నాడుచున్నది చిత్తమనియు, అజ్ఞానవశమున తానే సుఖదుఃఖాదులను పొందుచున్నట్లు వ్యర్థముగ తలంచుచుంటిననియు, తా నెప్పటియట్లే పూర్వమున్ను ఇపుడున్నుగూడ స్వస్వరూపమున నిర్వికారుడై, చిత్తాదులకు సాక్షియై చెన్నొందుచున్నాడనియు తెలిసికొని నిరావరణజ్ఞానసంపన్నుడై బ్రహ్మానందమున నోలలాడుచుండును. ఆత్మానుభూతియొక్క మహిమ యిట్టిది. సమస్త శక్తులకును, బలములకును ఆధారము ఆత్మయే గనుక ఆత్మశక్తి భౌతికశక్తులన్నింటిని మించియున్నది. కనుకనే విశ్వామిత్రుడు—

" ధిక్ క్షాత్రబలం బ్రహ్మతేజోబలం బలమ్ "

అని వాక్రుచ్చియున్నాడు. ప్రతి ప్రాణియందును ఈ ఆత్మశక్తి అప్రతిహతముగ వెలయుచున్నప్పటికిని జీవుల అజ్ఞానవశమున నయ్యది యెఱుంగబడక నిద్రాణమై వర్తించుచున్నది. బ్రహ్మైకత్వవిబోధముచే నద్దానిని మేలుకొలుపవలెను. అప్పుడు 'పంజరాదివ కేసరీ' యనునట్లు స్వాత్మసింహము ప్రకృతిశృంఖలములను భేదించుకొని స్వతంత్రరూపమున వినిర్గతమగును. ఈరీతిగ జీవునకు స్వస్వరూప ప్రాప్తిద్వారా నిరతిశయానందమును సంప్రాప్తింపజేయునదియగుటచే బ్రహ్మవిద్యకు లోకములో నెంతయో ప్రాధాన్యత యొసంగబడినది. అట్టి నిరుపమగు ఆధ్యాత్మవిద్యను మన పూర్వీకఋషులు అనేక త్యాగములు కావించి, కష్టముల కోర్చి, బహువిధసాధనల ననుష్ఠించి అనుభూతమొనర్చుకొని బోధించిరి. అమ్మహర్షుల పాదరజముచే భారతావని పునీతమైనది. వారి దివ్య బోధామృతధారలచే సంసిక్తమై యుండుటచే నేటికినిగూడ భారతదేశము ప్రపంచమునకంతకును శాంతిసందేశము నివ్వగలుగుచున్నది.

అట్టి మహర్షులసంతతియందు జన్మించిన మనము, మనకు వారు సంపాదించి యిచ్చిన జ్ఞానధనమును పోగొట్టుకొనకుండ చూడవలెను. అప్పుడే భారతదేశము చిరకాలమునుండియు సముపార్జించుచు వచ్చిన అధ్యాత్మప్రతిష్ఠను మనము కాపాడినవారమగుదుము.

"India is immortal if she persists in her search for God" అని వివేకానందులు చెప్పినట్లు, తన భగవదన్వేషణకార్యమును విడువకయున్నచో హిందూదేశము చిరస్థాయియై శాశ్వతకీర్తిని బడయగలదు. లేకున్న పతనమైపోవును.

కావున ఋషులు పొందిన పరమసత్యమును, ఆత్మసాక్షాత్కారరూపమహోన్నతలక్ష్యమును సర్వులును ప్రయత్నపూర్వకముగ తప్పక సంపాదించవలెను. 'మనము పాపులము కాము, పుణ్యాత్ములము, సచ్చిదానందస్వరూపులము' అను భావము రూఢిపడవలయును. 'నేను అజ్ఞానిని, పాపిని, అల్పుడను, దుర్బలుడను, నీచుడను' అని యెంతకాలము జీవుడు తలంచుకొనుచుండునో, అంతవఱకాతనికి వృద్ధి యెచట? 'నేను దేహమునుకాను, మనస్సునుకాను, కేవలఆత్మరూపుడను, పరబ్రహ్మస్వరూపుడను' అని అనవరతము చింతించుచుండుటవలననే అఖండధైర్యము, నిర్భయత్వము కలుగును. వివేకానందుల ఈ క్రింది గంభీర వాక్యముల నాలకింపుడు___

"Ye, divinities on earth! — sinners! It is a sin to call a man so; it is a standing libel on human nature. Come up, O lions and shake off the delusion that you are sheep. You are souls immortal, spirits free, blest and eternal; Ye are not matter. Ye are not bodies; matter is your servant, not you the servant of matter.........

"It is strength and strength that we want and the first step in getting the strength is to uphold the Upanishads and believe that I am the Atman."

అనగా "అవనిపై మూర్తీభవించిన ఓ దివ్యాత్మస్వరూపులారా! మీరు పాపులా! రామరామ! మనుజుని ఆ ప్రకారము అనుటయే పాపము. ఆ ప్రకారము మనుజుని పాపి యనుట మానవత్వముపైననే కళంకమాపాదించునట్లు. ఓ సింహములారా! లెండు, మీరు గొఱ్ఱెపిల్లలను భ్రమను పారద్రోలుడు. శాశ్వతమై, స్వతంత్రమై, ఆనందరూపమైనట్టి ఆత్మయే మీరు. మీరు దృశ్య

పదార్థము కారు, దేహము కారు; ప్రకృతి మీయొక్క దాసి. మీరు ప్రకృతికి దాసులు కారు......

'మనకు కావలసినది బలము, బలము! అట్టి బల సంపాదనమునకై వలసిన ప్రప్రథమకార్యము ఉపనిషత్తులను విశ్వసించి (ప్రోత్సహించి) 'నేను ఆత్మను' అని తలంచుటయే.'

వివేకానందుల ముఖమునుండి వెల్లివిరిసిన ఈ గంభీర నిశ్వాసము ముముక్షువుల కెల్లరకు తప్పక ధైర్యోత్సాహముల గలుగ జేయుననియు, వారి ఆధ్యాత్మికసాధనల యొక్క తీవ్రతను ఇనుమడింపజేయగలదనియు తలంచుచున్నాను. అయితే, మనుజుడు తాను నిత్యశుద్ధమగుఆత్మయని ఒకప్రక్క తలంచుచు, మఱియొక ప్రక్క అసురత్వమునకు, పాపాచరణమునకు చోటీయకుండ చూడవలెను. అట్లుకాక 'అంతయు బ్రహ్మమే, నేనూ బ్రహ్మమునే' అని చెప్పి యథేష్టాచరణమునకు గడంగగూడదు. అట్లు చేసినచో అది శుష్కవేదాంతము, మెట్టవేదాంతము అగునేగాని పరమార్థానుభవము కానేరదు. ఇవ్విషయమున సాధకులందరు బహుజాగరూకులై మెలంగవలెను. తమచరిత్రయందు, ఆచరణయందు ఏమాత్రము కళంకము రానీయకుండ జాగ్రతగ పరిశీలించుకొనుచుండవలెను. లేకున్న తమ సంప్రదాయమునకు, తమ మతమునకు, తమ దేశమునకు గూడ అప్రతిష్ఠ తెచ్చినవారగుదురు.

ఋషులు, మహాత్ములు బోధించినట్టి పైనదెల్పిన మోక్షరూపమగు పరమలక్ష్యమును, ఆత్మానుభూతిని ఈ జన్మయందే, ఇపుడే సాధించివేయుట ఉత్తమము. ఏలయనగా, ఇట్టి సదవకాశములు మఱుజన్మయందు — కాదు కాదు — మఱుక్షణమందును లభించునో లేవో చెప్పజాలము. మానవజన్మ యను అమూల్య

పెన్నిధి మనకు లభించినది. జంతువులమై పుట్టినచో మన గతి ఏమైయుండెడిది? అనేకజన్మల పుణ్యఫలము ఒకచోట జేరి మనకీ జన్మను తెచ్చిపెట్టినది. సంసారసముద్రమును దాటుటకు చక్కటి నావవంటి ఈ శరీరమును బొంది, అది శిథిలము కాకపూర్వమే ఆవలియొడ్డుకు జేరిపోవలెను. మోక్షమునకు సోపానభూతమైనట్టి ఈ మనుష్యదేహమును బొందియు ఎవరు భగవద్విషయమై యత్నింపరో అట్టివారు ఆత్మహంతకులే యగుదురు.

ఈ ప్రపంచమున సమస్త పదార్థములు అనిత్యములు; శాశ్వతసుఖమును గలుగజేయజాలు పదార్థ మొకటేని ఈదృశ్య వర్గమునందు కలదా? లేదు. భోగములా, ఆరంభమున సుఖప్రద ములుగ దోచి తుదకు మహాదుఃఖదాయకములుగ పరిణమించు చున్నవి. సంపదలు మెఱపుతీగెవలె చంచలములై యున్నవి. బంధు మిత్రులా, కళ్లార నశించిపోవుచున్నారు. ఈ మన దేహమున్ను నేడో, రేపో, ఎన్నడో రాలిపోనున్నది. గొప్పగొప్ప రాజులు, చక్రవర్తులు భూతలమునంతను ఏకచ్ఛత్రాధిపత్యముగ నేలిన అఖండ మహిమాన్వితులు, వీరులు, బలాఢ్యులుకూడ నామరూపములు లేక నశించిపోయిరి. ఇక మనమా శాశ్వతము? గొప్పగొప్ప బ్రహ్మాండములు, సృష్టిసమూహములు, లోకములుకూడ కాల గర్భమున విశీర్ణములై పోయినవి. ఇక యీ గృహారామ వనితా క్షేత్రాదులా స్థిరములు? ఆయువు తరగిపోవుచున్నది. కాలచక్రము రివ్వున తిరిగిపోవుచున్నది. నిమిషములు గంటలుగా మారిపోవు చున్నవి. గంటలు రోజులుగను, రోజులు సంవత్సరములుగను మారి జీవితమును ఆనాటికి దిగమ్రింగివేయుచున్నవి. చిల్లిపడిన కుండయందలి నీటివలె ఆయువు దినదినము సంక్షయమై పోవు చున్నది. మృత్యువు జీవుని కబళించివేయుటకు సిద్ధముగనున్నది.

కావున రేపు జేయవలసిన పనిని ఈ దినమే చేయవలెను. అంత్య కాలమున ఏది (పుణ్యము, దైవభక్తి, ఆత్మజ్ఞానము) ఉపకరించునో, దానిని ఇప్పుడే సంపాదింపవలెను. ఈ ధనముగాని, ఈ బంధువులుగాని, ఈ సంపదలుగాని, ఈ రూప యౌవన సౌందర్యాదులుగాని, ఈ ప్రాపంచిక యశస్సుగాని అవసానకాలమున ఏమైన అక్కఱకు వచ్చునా ?

'సర్వం వ్యర్థం మరణసమయే సాంబ ఏకస్సహాయః.'

అని శ్రీశంకరాచార్యులు నుడివినట్లు అంత్యకాలమున భగవంతుడొకడు తప్ప మఱియేదియును అక్కఱకురాదు. మఱియు,

' జన్మమృత్యు జరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్. '

అని శ్రీకృష్ణపరమాత్మ ఆనతిచ్చిన విధమున వైరాగ్య ప్రాదుర్భావముకై ఈ రీతిగ జన్మ, మరణ, వార్ధక్య, రోగాదులవలన కలుగు దుఃఖములను, దోషములను మనుజుడు తప్పక విచారించవలెను. శబ్దాది విషయభోగములు దుఃఖమే మూలముగా గలవి. వానితో జీవుడు ఎంతెంత సంబంధమును గలుగజేసికొనుచుండునో, అంతంత తీవ్రముగ దుఃఖములను మేకులు అతని హృదయమున గొట్టబడుచుండును. కాబట్టి మోక్షమందపేక్ష కలదేని మొట్టమొదట విషయములను, కోరికలను విషమువలె దూరముగ త్యజించివేయవలెను. కావుననే బుద్ధదేవుడు రారాజ కొమరుడై విలసిల్లినను, సమస్త భోగభాగ్యములతో తులదూగుచున్నను క్షణకాలములో వానినన్నింటిని త్యజించివైచి తీవ్ర సాధనచే నిర్వాణము (మోక్షము) నకు మార్గమును కనుగొనెను. అట్లే భగీరథుడు, భర్తృహరి మొదలైన రాజులున్ను సర్వ ప్రాపంచిక సౌఖ్యముల ననుభవించి, కడకు వానియందు వాస్తవ సుఖములేదని నిశ్చయించి, ఆత్మశాంతికై తపనపడి, తుదకు

వానిని వదలివైచి వైరాగ్యపరులై బ్రహ్మధ్యానమున పరమానందము ననుభవించిరి. ఈ ప్రకారముగ ఎందరో మహనీయులు దృశ్యసౌఖ్యములను బాగుగ పరీక్షించి పరీక్షించి తుదకు అవి సారహీనములని త్రోసివైచిరి. ఒకవేళ అనుభవించినను వాని యందు ఎప్పటికైన తృప్తికలుగునా యనిన, అదియునులేదు. పైపెచ్చు అనుభవించినకొలది (నేయిపోసిన నిప్పువలె) కోరికలు పెరుగునేకాని తరగవు.

న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి,
హవిషా కృష్ణవర్త్మేవ భూయఏవాభివర్ధతే.

అను యయాతి వాక్యమే ఇందులకు తార్కాణము.

నీటిలో ముంచబడినవాడు ప్రాణవాయువునకై యెట్లు తల్లడిల్లునో, నిప్పుకణిక శిరస్సుపై బెట్టబడినవాడు తాపమును సహింపజాలక, దానిని తొలగింప నెంత యాతురత జూపునో, మండువేసవి మధ్యాహ్నకాలమున సలసలకాగుచున్న ఇసుకపై పడవేయబడిన చేప శీతలోదక సంగమునకై యెట్లు వేగిరపడు చుండునో, గృహము జాజ్వల్యమానముగ దహింపబడుచుండ, లోనున్న వ్యక్తి బయటకు వచ్చుటకై యెట్లు తహతహలాడు చుండునో, తీవ్ర వైరాగ్యముగల ముముక్షువున్ను ఈ సంసార జంజాటములోనుండి తప్పించుకొని యెప్పుడు బయటబడుదుమా యని తల్లడిల్లుచుండును. సంసారనిదాఘనిపీడితుడై ఆత్మానంద మను శీతల జాహ్నవీతోయమున నెప్పుడు క్రుంకులిడుదుమా యని యువ్విళ్లూరుచుండును. వైరాగ్యమున ఇంత తీవ్రత్వము లేనిచో ఆత్మజ్ఞానము కలుగదు; కలిగినను నిలువదు.

తీవ్ర వైరాగ్యముచే ఇంద్రియములు శబ్దాదివిషయము లందు ప్రవర్తింపక యుండును. అట్టి ఇంద్రియ సంయమముచే

మనస్సు స్వాధీనపడును. మనోనిరోధముచే ఆత్మయొక్క ఆవరణము తొలగిపోవును. అత్తఱిజీవుడు తన యథార్థస్వరూపమున నిలుకడ కలిగియుండును. అదియే మోక్షము. కావుననే ఉపనిషత్తు లీ క్రిందివిధమున నుద్ఘోషించుచున్నవి.

యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేఽస్య హృదిశ్రితాః
అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే.

— కఠోపనిషత్తు.

అనగా హృదయమున నున్నట్టి కోరికలు, సంకల్పములు, దృశ్య వాసనలు అన్నియు తొలగగా మనుజుడు జననమరణ రహితుడై ఇచ్చోటనే పరబ్రహ్మము (మోక్షము) ను బొందుచున్నాడు.

ఈ ప్రకారముగ ముముక్షువగువాడు విషయవిరక్తి కలిగి నిజగృహమందుగాని, లేక పుణ్యాశ్రమములందుగాని ధ్యానము, బ్రహ్మచింతన, ఇంద్రియనిగ్రహము మొదలగునవి అభ్యసించుచు సద్గురువులయొద్ద, అనుభవజ్ఞులగు మహాత్ములయొద్ద అనుష్ఠాన పద్ధతులను నేర్చుకొని క్రమముగ ధ్యేయాకారమందు (ఆత్మ యందు) నిలుకడ బొందవలెను. ఇందులకై సోమరితనమును వీడి నిరంతరము పరిశ్రమ చేయవలసియున్నది. అధ్యాత్మరంగమున తగిన శిక్షణ పొందవలెను. ప్రాపంచికకార్యసాధనలకై జనులు ఎంత ఓపిక, ప్రీతి, ఏకాగ్రత ప్రదర్శించుచున్నారో, అట్టిదానిని దైవకార్యములందు జూపినచో ఎప్పుడో మోక్షమును బొంది యుండెడివారు. పూర్వపు దుస్సంస్కారములు, దుర్వాసనలు అంతరించి చిత్తము దైవమయమై, తేజోవంతమై చెన్నొందవలెను. దోషయుక్తములగు అణువులన్నియునశించి మనస్సు విశుద్ధ సత్త్వమున ప్రతిష్ఠితము కావలెను. రాగి బంగారుకావలెనన్న,

లేక రాయి విగ్రహము కావలెనన్న ఎంతయో కృషి, పరిశ్రమ ఆవశ్యకమైయున్నట్లు జీవుడు శివుడుకావలెనన్న అకుంఠిత దైవ విశ్వాసము, మహత్తర సాధన ఆవశ్యకమైయున్నవి. విద్యార్థులు పరీక్షలందు తీర్ణులగుటకై రాత్రింబగళ్లు విరామము లేక ఎట్లు చదువుచుందురో, అట్లే ఆత్మవిద్యయందు తీర్ణుడగుటకై ముముక్షువు అనవరత జప, ధ్యాన, ఆత్మ విచారణాదులను గావింపవలెను. సాధకుడగు జీవుని పడగొట్టుటకై మాయ కాచుకొనియున్నది. కావున ఆ మాయను పడగొట్టుటకై జీవుడు భక్తి జ్ఞాన వైరాగ్యాది ఆయుధములతో సన్నద్ధుడై యుండవలెను.

అయితే మనము చేయు జప తప సంకీర్తనాదులచే మన యంతఃకరణము పూర్వముకంటె శుద్ధత్వమును బొందుచున్నదా లేదా యను విషయమును పరీక్షించుకొనుచుండవలెను. ఇన్ని గంటల ధ్యానము, ఇన్నివేల జపము, ఇన్నివత్సరముల తపస్సు — ఇవి అంతలెక్కలో చేరినవికావు. వాని ఫలితము తమకేమి కలిగినది—అని చూచుకొనవలెను. ఎంతకాలము చిత్తము అంతర్ముఖమై దైవచింతనయందో, సాక్షిస్వరూపమందో నిలుకడకలిగి దృశ్యవృత్తులు లేకయున్నది — ఇదియే ప్రతివారు పరీక్షించుకొనుచుండవలసిన విషయము. ప్రారంభావస్థలలో మనస్సు సాక్షిస్వరూపమందు నిలుకడకలిగియుండుట సాధ్యముకాదు. కావున ఎంతవఱకు మనస్సు అంతర్ముఖమైయుండునో అంతవఱకు ధ్యానాదులందు కాలముగడపి తదుపరి ఏదైవకార్యమందో, ఉపనిషదాది ఉద్గ్రంథపఠనమందో, గురుసేవయందో, పూజాసంకీర్తన భజనాదులందో, పరోపకార క్రియలందో అద్దానిని వినియోగించవలెను. అట్టిచో మనస్సు ఏకాలమందును మాలిన్యమునొందకయే యుండును.

ఈ రీతిగ శ్రద్ధాభక్తులతో సాధనచేయుచురాగా క్రమముగ అవిద్య నశించిపోవ ముముక్షువు తన యథార్థ (ఆత్మ) స్వరూపమును గుర్తెరిగి తాను దేహాదిదృశ్యము కాననియు, నిత్యశుద్ధ చిదాత్మయేయనియు దృఢనిశ్చయము కలవాడై బ్రహ్మానందమున నోలలాడుచు జీవన్ముక్తుడై విలసిల్లుచు. అట్టి మహోన్నత స్థితిని, పరమలక్ష్యమును ఈ జీవితమందే సర్వులుచు సాధించి ధన్యులయ్యెదరుగాక! ఒకవేళ లక్ష్యప్రాప్తికిపూర్వమే సాధకునకు మరణము సంప్రాప్తమైనచో, అందు విచారపడవలసిన దేమియును లేదు. 'శుచీనాం శ్రీమతాం గేహే' అనునట్లు నుజుజన్మయందు ఉత్తమగర్భమున జనించి మిగిలిన సాధనను అతడు పూర్తి చేసికొనును.

'న మే భక్తః ప్రణశ్యతి'

'నహి కల్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి'

అనగా 'నా భక్తుడెన్నటికిని చెడడు', 'సత్కార్య మాచరించువానికి దుర్గతి ఎన్నటికిని కలుగదు' - అను నీప్రకారములగు భగవంతుని ప్రతిజ్ఞాపూర్వక వచనములను సంస్మరించుకొని అఖండ ధైర్యోత్సాహ సమన్వితులమై వెనక చూపులేక ఆత్మమార్గమున ఇతోధికముగ యత్నించెదముగాక!

ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్య వరాన్నిబోధత!

మున్నగు ఉపనిషద్వాక్యములు— "అజ్ఞాన నిద్రనుండి మేల్కొనుడు! ఆత్మ విషయమున జాగరూకులై యుండుడు! మహనీయుల యొద్దకేగి ప్రబోధము నొందుడు!" అని జనులను హెచ్చరించుచున్నవి. వానినాలకించి దైవప్రోక్తములగు అట్టి వాక్యములపై అచంచల విశ్వాసముగలిగి తద్రీతి యనుష్ఠించుటకై యుపక్రమించెదము గాక! ఎప్పుడు మనము మన లక్ష్య

ప్రాప్తికై దృఢనిశ్చయులమై సర్వేశ్వరునియెడలను, సద్గురువు యెడలను అనుపమభక్తిగలిగి సాధన నుపక్రమించెదమో, అప్పుడిక ప్రపంచమునందలి ఏ శక్తియు అకార్యమునుండి మనలను నిరోధించుటకు సమర్థము కాజాలదు.

క్షణికములును, అశాశ్వతములును, పరమానందప్రాప్తి రహితములు నగు స్వల్పస్వప్న ప్రాపంచికలక్ష్యములకై జీవితములను ధారవోయుటకంటె శాశ్వతమై, ఇహపరశ్రేయోదాయకమై, సర్వోన్నతమై, నిత్యానందప్రదమైనట్టి బ్రహ్మాత్మైక్యరూప చరమ లక్ష్యమును సాధించుటకై ఏల యత్నము సలుపరాదు?

"Better to aim at a lion and miss it, rather than hunt a jackal and catch it." — అను నొక ఆంగ్లోక్తి కలదు. దాని యర్థమేమనిన, 'పరుగెత్తుచు వెంటాడి నక్కను బట్టుకొనుటకంటె, తప్పిపోయిననుసరే సింహమునే గురిపెట్టికొట్టుట మంచిది.' అట్లే చిన్నచిన్న సాంసారికలక్ష్యములను, పదవులను జీవితాంతము వఱకు పట్టుకొని వ్రేలాడుటకంటె పూర్ణశోకశాంతి, ఆనందప్రాప్తి గలుగజేయు భగవత్సాక్షాత్కారమునకై యత్నించుట మేలు.

కాని, బహుజన్మార్జితములగు ప్రాపంచికవాసనలు, సంస్కారములు జీవులలో ఘనీభవించి యుండుటచే ప్రారంభముననే అకార్యమున విజయము కలుగకపోవచ్చును. కొన్ని యాటంకములు విఘ్నములు కలుగవచ్చును. కాని ఎన్ని విఘ్నములు తటస్థించినను, ఎన్ని యిక్కట్లు దాపురించినను, ముందు పెట్టిన అడుగును వెనుకకు మరల్చరాదు. సాధనను ధైర్యముతో కొనసాగించుచునే యుండవలెను. సర్వేశ్వరునియెడల, సద్గురువు యెడల అనన్యభక్తిగలిగి యున్నచో విఘ్నములన్నియు పటాపంచలై పోవును. ప్రకృతిరూపమగు మాయ ఈశ్వరుని అధీనమై

యున్నది గావున,ఆమాయను జయించవలెనన్న మాయాధీశుడగు ఈశ్వరుని అనుగ్రహమును తప్పక పొందియే తీరవలెను. అదియో నిష్కామకర్మము, భక్తి మున్నగువానిచేతనే కలుగును. కాబట్టి హృదయపూర్వకముగ సర్వేశ్వరుని, సద్గురుని నిర్మలభక్తితో నారాధించుచు, వైరాగ్య వివేక విచారణాదులు కలవారై శ్రద్ధతో ఆధ్యాత్మికసాధనలను కొనసాగించినచో, అచిరకాలము లోనే ప్రతిబంధము లన్నియు పలాయనములై పోయి లక్ష్యము కరతలామలకముగ గోచరించును. అత్తఱి — దేనిచే జీవరాసు లన్నియు బంధింపబడినవై సత్యవస్తువు నెఱుగజాలకున్నవో, ఎయ్యది ఉన్నదానిని లేనిదిగను, లేనిదానిని ఉన్నదిగను కల్పించి ఈ జగన్నాటక మాడుచున్నదో అట్టి దురంతమగు మాయ క్షణకాలములో సాధకునకు లొంగిపోవును. అట్టిస్థితియే మోక్షము. అదియే స్వారాజ్యము.

స్వరాజ్యప్రాప్తికై భారతీయులు ఎన్నియో వత్సరములు అనేకయిడుములు బడవలసివచ్చెను. లాఠీదెబ్బలను, ఫిరంగిగుండ్లను సహింపవలసివచ్చెను. పెక్కుత్యాగములను గావింపవలసివచ్చెను. అట్టిచో నిక స్వారాజ్య (మోక్ష) రూపమగు బ్రహ్మత్వప్రాప్తికై ఎన్నికష్టముల నోర్వవలెనో, ఎంతసాహసము జూపవలెనో, ఎన్ని త్యాగములను జేయవలెనో యోచించుకొనుడు. ఒక చిన్న ఉద్యోగమును సంపాదింపవలెనన్నగాని, ఒకపరీక్ష ప్యాసుకావలెనన్నగాని రాత్రింబగళ్లు కృషిచేయుచున్నారుగదా! ఇక ఎద్దానియందు గంధర్వ, ఇంద్ర, బ్రహ్మదేవుల ఐశ్వర్యమున్ను, ఆనందమున్ను లవలేశములే అయియున్నవో, అట్టి బ్రహ్మసంపదపదవి నలంకరించుటకై ఒకింత శ్రమజేయుట కష్టమా?

మహాశయులారా! ఘోర తమస్సునందు కూలద్రోయు నాస్తికులప్రలాపములకు చెవియొగ్గక నిర్భీకులమై సత్యమార్గమున దైవమార్గమున జనెదముగాక! త్రోవలో దుఃఖములువచ్చునా? అవియన్నియు సుఖములే. అనంతానందపదవి నొందబోవుచుండ, మార్గమున తగులు శ్రమ శ్రమకాదు; శ్రేయమే యగును. ఇక భయము దేనికి? మృత్యువునకా? అది మనలను పిలువకమునుపే మనమే దానిని ఆహ్వానించుస్థితిలో బాగుగ తయారై యున్నచో ఇక నది మనల నేమిచేయగలదు? చేయవలసినపని (ఆత్మజ్ఞానసంపాదనము) పూర్తిఅయినచో, ఇక మృత్యువు వచ్చిననేమి? రాకున్న నేమి? అట్టి కృతకృత్యునకు మరణము మంగళమే యగును.

కాబట్టి నిర్భయచేతస్కులమై గమ్యస్థానమగు పరమాత్మను జేరువఱకు వెనుకకు మరలక, భక్తి జ్ఞాన వైరాగ్యాది సాధనసంపత్తితోగూడి ధైర్యోత్సాహముతో ఆత్మమార్గమున నధిగమించుచు, సర్వేశ్వరుని కృపచే ఈ జన్మయందే చరమలక్ష్యమగు మోక్షమును సంపాదించి ధన్యులమయ్యెదముగాక! తల్లి గర్భమునుండి ఏడ్పుతో ప్రారంభమైన ఈ జీవితము తుట్టతుదకు నవ్వుతో అంతమగుగాక!

"అహోఽస్మాకమలం మోహైరాత్మా బ్రహ్మేతి నిర్భయమ్"

— శ్రీ శంకరాచార్యులు

అనగా 'దేహేంద్రియ మనంబులకు సాక్షియై విలసిల్లు ఈ ప్రత్యగాత్మయే పరబ్రహ్మము — ఈ పరమసత్యమును తెలిసికొని నిర్భయులై యుండుడు!' అని యీ ప్రకారముగ మహాత్ములగు గురువులు, ఋషిసత్తములు మ్రోగించిన వేదాన్తడిండిమము —

అద్వైత జయభేరి అప్రతిహతనాదంబున మన కర్ణగోళంబులందు నిరంతరము ప్రతిధ్వనించుచు కర్తవ్యమునకై మనలను పురిగొల్పు గాక! ఆ దివ్యనిస్వనము దశదిశలు పిక్కటిల్లునట్లు ముఖరితమై యెల్లెడల వ్యాపించి జనుల హృదయాంతరాళములను ఉత్తేజపరచి ఆత్మోన్ముఖమగునట్లు ఒనర్చుగాక!!

హరిః ఓం తత్ సత్.

294.5
U33
Acc No. 5446